క్లుప్తంగా

యువ క్రీడాకారిణికి సన్మానం



ఐనంపూడి(పామర్రు): మండల పరిధిలోని ఐనంపూడి గ్రామంలోని యువ క్రీడాకారిణి నక్కా వీరనాగ అనును శుక్రవారం ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ ఒలంపిక్స్ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ భట్టు పరంజ్యోతి రాఘవ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పరంజ్యోతి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన తెనాలిలో జరిగిన పదవ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ 47 కేజీల విభాగంలో నాగఅను గోల్డు మెడల్ సాధించిందని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మాజీ ఎంపీటీసీ బీవీ రాఘవులు, స్థానిక ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం

గుడివాడరూరల్: నందివాడ మండలం జనార్థనపురం గ్రామంలో ఇటీవల మరణించిన మద్దుల వెంకట రామాంజనేయులు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ప్రభుత్వ ఆర్థికసాయాన్ని శుక్రవారం నందివాడ మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొప్పుల జయరాజు, పంచాయతీ కార్యదర్శి కొడాలి రామ్మోహనరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ పితామహుడు రామ్మూర్తి వర్ధంతి

గుడివాడరూరల్: విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో పండిట్ గానాల రామ్మూర్తి 86వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానిక బంటుమిల్లిరోడ్‌లోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ పితామహుడు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ, దేవస్థానం ఉపాధ్యక్షుడు యలమర్తి కోటేశ్వరరావు, నాయకులు వల్లభపురపు కృష్ణకిషోర్, మహేశ్వరం, సత్యనారాయణలు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

పెదపారుపూడి: ప్రతి మహిళ మొబైల్‌లో దిశ యాప్ ఉంటే రక్షణ కవచం ఉన్నట్టేనని ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణి అన్నారు. పెదపారుపూడి సెంటర్‌లో శుక్రవారం వాహనదారులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుని వచ్చిన దిశ యాప్ ద్వారా ఎంతో మంది మహిళకు రక్షణగా ఉంటుందన్నారు. రాత్రి సమయంలో ఆపద ఉన్న మహిళలు దిశ యాప్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే దిశ పోలీసులు, స్థానిక పోలీసులు రక్షిస్తారని తెలిపారు. దిశ యాప్ వల్లన కలిగే లాభాలను వాహనదారులకు వివరించారు. సుమారు 200 మంది వాహన దారుల ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడు చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుకల పంపిణీ పూర్తి చేయండి

గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ జి.గోపాలరావు అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరు ఎంఆర్సీలో హెచ్‌ఎమ్‌ల సమావేశంలో మాట్లాడారు. యూనిఫామ్స్, బ్యాగ్, బెల్ట్, షూస్, పాఠ్య పుస్తకాలను త్వరితగతిన విద్యార్థులకు అందజేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎమ్‌లను ఆయన ఆదేశించారు. నాడు–నేడు ఫేజ్ –2 కింద అన్ని పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలని సూచించారు. హెచ్‌ఎమ్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పథకాలు, సేవలు అందించడమే లక్ష్యం

పెదపారుపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కొత్తగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కింద ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశం పెట్టిన సురక్ష ద్వారా ప్రజలకు నిత్యం ఉపయోగపడే ఆదాయ, కుల, జనన, మరణ, మ్యుటేషన్, పెళ్లి ధ్రువీకరణ, కుటుంబ సభ్యులు ధ్రువీకరణ, పంట హక్కు కార్డు వంటివి ప్రజలకు ఉచితంగా ఇస్తారన్నారు. ప్రతి ఇంటికీ వచ్చి పత్రాలు అవసరం ఉంటే గుర్తించి సచివాలయాల వద్ద క్యాంపు నిర్వహించి పత్రాలు అందజేస్తారని తెలిపారు .

సచివాలయాలవారీగా క్యాంపు తేదీలు..

మండలంలోని యలమర్రు సచివాలయం వద్ద జూలై 1తేదీన. 4న వెంట్రప్రగడ–1, 6న వెంట్రప్రగడ–2, 11న వానపాముల, 13న భూషణగుళ్ళ, 15న చినపారుపూడి,18న పెదపారుపూడి, 20న దోసపాడు, 25న మోపర్రు సచివాలయాల వద్ద క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, జెడ్పీటీసీ సభ్యురాలు మండవ దేదీప్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు అందరికి అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులై ఉండి ఏ ఒక్కరూ పథకాలు అందకుండా మిగిలి పోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం జగనన్న సురక్ష అని అన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను సర్వీస్ చార్జి లేకుండా అందజేస్తారని తెలిపారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తారన్నారు. ప్రజలు అందరూ సద్వినియోగంచేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, ఎంపీడీవో వై.రామకృష్ణ,ఎంఈవో–2 పద్మరాణి, ఎంపీటీసీ టీ శ్రీనివాసరావు, కో ఆప్షన్‌సభ్యులు ఎండీ హస్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి ప్రసంగం వింటున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



కైకలూరులో జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమం చూస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

గుడివాడరూరల్: స్థానిక పెద ఎరుకపాడు 25వ వార్డు సచివాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది వీక్షించారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్ (పసి) పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని నాయకులు, అధికారులు వీక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి విజయప్రకాష్‌తో పాటు పలువురు అధికారులు వీక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, తహసీల్దార్ కే శ్రీనివాస్, ఎంపీడీవో పీ మల్లీశ్వరి, ఇతర అధికారులు ఉన్నారు.

మండవల్లి: స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ మెండా ఝాన్సి టీవీలో వీక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ల యాదవ్, ఎంపీటీసీ గూడపాటి ఝాన్సి, వలంటీర్లు పాల్గొన్నారు.

మండవల్లి: ప్రభుత్వం ప్రజల మేలుకోసం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపట్టిందని డెప్యూటీ కలెక్టర్ కే బాబ్జీ అన్నారు. మండవల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బాబ్జీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేవిధంగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు పేర్కొన్నారు. 24వ తేదీ నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు జగనన్న సురక్ష ప్రోగ్రాంలో పాల్గొని అర్హత ఉండి లబ్ధి చేకూరని వారి వివరాలు సేకరించి వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తారని పేర్కొన్నారు. ఎంపీడీఓ టీకే వెంకటరమణ, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదపూడి (మొవ్వ): మండలంలోని పెదపూడి, అయ్యంకి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వలంటీరులకు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదపూడిలో జరిగిన కార్యక్రమంలోఎమ్మెల్యో జుజ్జువరపు రాజు మాట్లాడుతూ నెల రోజులపాటు సాగే జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటరీలు, సచివాలయ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. మండల సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, వలంటీర్ల కన్వీనర్ తాతా రామదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు తాతా రాంబాబు, వీఆర్వో జే కోటేశ్వరరావు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'

కైకలూరు: జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం తాడేపల్లి నుంచి సీఎం లాంఛనంగా ప్రారంభించిన జగనన్న సురక్ష వీడియో కాన్ఫరెన్సులో భాగంగా కైకలూరు తహసీల్దారు కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శనివారం నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అభిమానులు ప్రతీ ఇంటిని సందర్శిస్తారన్నారు. జూలై 1 నుంచి క్యాంపులు నిర్వహించి జనన, మరణ, కుల, ఆదాయ వంటి ధ్రువపత్రాలను అందిస్తారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అమలుతోపాటు, వివిధ ధ్రువపత్రాలు అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ళ బేబీ, కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, మండల ప్రత్యేకాధికారి ఇ.నరసింహారావు, తహసీల్దారు బి.మురళీకృష్ణ, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



పామర్రు ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం వీక్షిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



సీఎం ప్రోగ్రామ్‌ను తిలకిస్తున్న సచివాలయ ఉద్యోగులు

బొప్పాయితోటల పరిశీలన

పామర్రు: ఉద్యాన శాఖ ద్వారా పలు రకాల పండ్ల తోటలకు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ప్రాంత హార్టికల్చర్ ఆఫీసర్ జల్లి కీర్తి దేవ్ అన్నారు. పామర్రు మండలంలో సాగులో ఉన్న బొప్పాయి తోటలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యాన శాఖ పామర్రు పరిధిలో పామర్రు, గుడివాడ, గుడ్లవల్లేరు, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలు ఉంటాయన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా పండ్లతోటల పెంపకానికి రాయితీలు అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. ముఖ్యంగా బొప్పాయి తోటలకు ఎకరానికి రూ.12 వేలు రాయితీ ఇస్తుందని, మామిడి పంటకు రూ.5,350, జామ పంటకు రూ.11,730, నిమ్మకు రూ.6,402, టిస్యూకల్చర్ అరటికి రూ.16,394 వంతున ప్రభుత్వం రాయితీ ఇస్తోందని అన్నారు. అయిల్ పామ్‌సాగు పెంచడానికి నేషనల్ మిషన్ ఎడిబుల్ అయిల్ పథకం ద్వారా ఆయిల్ ఫామ్ మొక్కలకు, పెంపకానికి రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలి.

నా ధ్యాసంతా నియోజకవర్గ అభివృద్ధి మీదే..

పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు

పామర్రు: తన ఆలోచన, ధ్యాస అంతా నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు పేర్కొన్నారు. తన హయాంలో నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీసిందన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న కాలంలోనూ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడే విధంగా తన రాజకీయ పయనం ఉంటుందన్నారు. సమావేశంలో తిరుమలశెట్టి వాసు, మొవ్వ శ్రీనివాస్, జొన్నలగడ్డ కేశవరావు, కొడాలి బసవయ్య పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం

మండవల్లి: మండలంలోని పుట్లచెరువులో శుక్రవారం జల్‌జీవన్ మిషన్ పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.44 లక్షల నిధులతో నిర్మించే ఈ పథకం ద్వారా ప్రజల అవసరాలు తీరే స్థాయిలో నీరు అందుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), సర్పంచి గురుగుబెల్లి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి వడ్లాని నరసింహారావు, ఎం. వెంకటరావు, కె.శ్రీనివాసరావు, జి.నరశింహారావు, ఎం.రంగారావు, ఎం.మల్లేశ్వరరావు, ఎస్.యరకయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీవీ కృష్ణారావు, కార్యదర్శి రాధిక, కాంట్రాక్టర్ ఎ. రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడరూరల్: పట్టణంలోవిద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గీతాభవన్‌రోడ్, బస్టాండ్ సెంటర్, నవతారోడ్, రాజేదర్బార్‌రోడ్డు, అట్లూరి బసవయ్య కల్యాణ మండపం రోడ్, గుడ్‌మన్‌పేట, కిన్నెర కాంప్లెక్స్, కాకర్లవీధి, బాపూజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

బీసీ వెల్ఫేర్ బోర్డు సభ్యుడికి వినతి

పామర్రు: రాష్ట్రంలోని పిరమళై కల్లర్ కులస్తులకు గుర్తింపు కల్పించి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని పిరమళై కల్లర్ సంక్షేమ సంఘ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడే సీ శల్వమ్ శుక్రవారం పామర్రులో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ మేరకు విజయవాడలోని బీసీ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జస్టిస్ శంకర్ నారాయణను కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు. బోర్డు సభ్యులను కలిసిన వారిలో స్టేట్ ప్రెసిడెంట్ సీ ఈశ్వర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నటరాజ్ వెంకటేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ మురుగన్, జిల్లా కార్యదర్శి ఆర్.ఈశ్వర్, జిల్లా ట్రెజరర్ చెల్లపాండి ఉన్నారు.



బీసీ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు శంకర్‌నారాయణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉప్పాలకు ఎమ్మెల్యే వసంత నివాళి

గుడ్లవల్లేరు: దివంగత వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉప్పాల రాంప్రసాద్ చిత్రపటం వద్ద మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. శుక్రవారం ఉప్పాల నివాసంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, ఉప్పాల నెహ్రూ, ఉప్పాల వాసు తదితరులు పాల్గొన్నారు.



రాంప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం

కైకలూరు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కలిదిండి మండలం కొండూరులో పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన పైపులైనును శుక్రవారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.నాగబాబు మాట్లాడుతూ గతంలో పాడైన తూముల స్థానంలో 1.5 కిలోమీటర్ల పొడవుతో నూతన పైపులైను నిర్మించామన్నారు. దాదాపు 200 మంది ప్రజలకు నీటి సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమములో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ బొర్రా వెంకటలక్ష్మీ, నాయకులు బొర్రా ఏసుబాబు, వీర్రాజు, పండు రవి, వాసిపల్లి బాబురావు, రమణ, ఎం ప్రసాద్, గోళ్ళ నాగులు, కొండా, రమేష్, పంచాయతీ కార్యదర్శి నజ్రీన్, సచివాలయ సహాయకులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

కైకలూరు: నూతనంగా విధుల్లో చేరిన వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను ఆయన నివాసం వద్ద శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుడివాడ డివిజన్ డ్రెయినేజీ శాఖ ఈఈ విజయలక్ష్మి, కలిదిండి మండలంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రవికుమార్ తదితరులు ఎమ్మెల్యేను కలుసుకుని శాఖాపర అంశాలపై చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.



కొండంగిలో పైప్‌లైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ప్రజాప్రతినిధులు

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్.మాధవి శుక్రవారం తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌కు 2 పోస్టులు, ఎంకామ్‌కు ఒక పోస్టును గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఫస్ట్ క్లాస్ కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ, ఎక్స్‌పీరియన్స్ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను gdcjkc.movva@gmail.com కు పంపించాలని, ఈ నెల 27వ తేదీన ఇంటర్వ్యూ ప్రాతిపదికన పోస్టుల భర్తీ చేస్తామని తెలిపారు.

వైభవంగా లక్ష మల్లెల పూజ

కైకలూరు: ఆషాఢమాసం మొదటి శుక్రవారం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారికి లక్ష మల్లెల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఎంపీపీ అడవి కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్ పర్యవేక్షణలో అర్చకులు భీమకిషోర్ సీతారామయ్య బృందంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు వసుంధర మురళి, పంద్రంగి ప్రసాద్, వేంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బొప్పన శివకుమార్, శ్రీమన్నారాయణ గోష్టి సభ్యులు చిట్టి హేమలత, శంకరశాస్త్రి పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ

ముదినేపల్లి రూరల్ : ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు పూర్తి విశ్వాసం ఏర్పడుతుందని ఎంఈఓ కే నరేషకుమార్ అన్నారు. మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రతి విద్యార్థికి వర్తించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జగనన్న విద్యాకానుకలను విద్యార్థులకు అందజేసి వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బేతాల రాజేంద్రప్రసాద్, సీహెచ్ చక్రధర్, పాఠశాల ప్రగతిని ఎంఈఓకు వివరించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పమిడిముక్కల: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని లంకపల్లి సర్పంచి వేమూరి రత్నకుమారి తెలిపారు. మండల పరిధిలోని లంకపల్లి సచివాలయంలో శుక్రవారం లంకపల్లి, శ్రీరంగపురం అంగన్‌వాడీ కేంద్రాల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కృష్ణాపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అంగన్‌వాడీలలో అందించే సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేడూరులో...

మేడూరు సచివాలయంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి గొర్కెపూడి స్వర్ణలత, పమిడి ముక్కల సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూరు శాతం రికవరీ సాధించిన పీఏసీఎస్

కైకలూరు(కలిదిండి): కలిదిండి బ్రాంచి పరిధిలోని వెంకటాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) 2022–23 ఆర్థిక సంవత్సరంలో అందించిన రుణాలను నూరు శాతం వసూలు చేసి అందరి మన్ననలు పొందింది. ఈ మేరకు కలిదిండి బ్రాంచి కార్యాలయంలో మేనేజరు పీవీ.సత్యనారాయణకు వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని వెంకట పార్థసారథి, సీఈవో పి.శ్రీనివాసరావు రికవరీ వివరాలను శుక్రవారం అందించారు. అనంతరం చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి పీఏసీఎస్ ద్వారా అందించిన రూ.10,19,89,000 రుణాలను పూర్తిగా వసూలు చేశామన్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులు, కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

పశువులకు 24 గంటలూ వైద్యం అందేలా చర్యలు

జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి దివాకర్

గుడివాడరూరల్: గుడివాడ వెటర్నరీ ఆసుపత్రిలో పశువులకు 24 గంటలు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ఎంఎస్ఏ దివాకర్ పేర్కొన్నారు. గుడివాడ పశు సంవర్ధక వైద్యశాలలో రాత్రి వేళల్లో పశువులకు వైద్యం అందటం లేదని సామాజిక వేత్త ఆర్‌కే ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ దివాకర్ గుడివాడ పశు వైద్యశాలను శుక్రవారం సందర్శించారు. వైద్యశాలలో పశువులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు 24గంటలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పశువులకు వైద్యం అందేలా పని చేయాలన్నారు. పాడి రైతులకు మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి విజయవంతం అమలు చేస్తుందన్నారు. ఏ సమయంలో నైనా వైద్యం అందించేందుకు వైద్యులు సకాలంలో స్పందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని దివాకర్ పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో పశు పోషకులు పశువులను రోడ్లపై వదలవద్దని ఆయన కోరారు. రాత్రి వేళల్లో పశువులకు వైద్యం అత్యవసరమైతే ప్రభుత్వ టోల్‌ఫ్రీ 1962 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.



దివాకర్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పామర్రు: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) సంఘ నాయకులు పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి దోనే అశోక్‌కుమార్, యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కౌంతి అంకరవి, గౌరవ అధ్యక్షుడు ప్రకాశరావు, ఆడిట్ కమిటీ సభ్యులు ఆకుల బ్రహ్మయ్య, కార్యదర్శి ముస్తఫాలు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

గుడ్లవల్లేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన దిశా చట్టాన్ని మహిళలు, విద్యార్థునులు వినియోగించుకోవాలని గుడివాడ సీఐ కె.ఎస్.వి.జయకుమార్ కోరారు. శుక్రవారం గుడ్లవల్లేరులో స్పెషల్ డ్రైవ్ కింద విద్యార్థినుల ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. దిశ యాప్ ఉండటం వలన మహిళలకు రక్షణగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎస్.ఐ వి.ఏసేబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న సీఐ జయకుమార్